భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం జిల్లాలో పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక రూపాల్లో అలంకరించారు.


–సాక్షి, నెట్‌వర్క్


అమిస్తాపూర్‌లోని సాక్షి గణపతి ఆలయంలో శ్రీలలితాదేవిగా..


శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో అలంకరణలో అమ్మవారు


లక్ష్మీపల్లిలో గాయత్రిదేవి అలంకరణలో కనకదుర్గాదేవి


దేవరకద్రలో దుర్గామాతను గాయత్రి మాతగా అలంకరణ


చిన్నచింతకుంట గంగభవానీ ఆలయంలో గాయత్రీదేవిగా..


జడ్చర్ల సకలదేవతల ఆలయంలో గాయత్రీమాతగా అమ్మవారికి పూజలు


దేవరకద్ర వాసవీమాత ఆలయంలో గాయత్రిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

'అసత్య ఆరోపణలు తగదు'

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పీఏసీఎస్ ఫోరం తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని డీసీసీబీ మాజీ సీఈఓ లక్ష్మయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం తనపై వచ్చిన ఆరోపణలకు ప్రతిస్పందనగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో తనపై పీఏసీఎస్‌ల ఫోరం చేసిన ఆరోపణలు అసత్యమని పేర్కొన్నారు. తాను బ్యాంకు సీఈఓగా విధులు నిర్వర్తించిన సమయంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని వివరించారు. బ్యాంకులో గోప్యంగా ఉండాల్సిన రికార్డులు ఫోరం చేతిలోకి రావడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ఉద్యోగులపై అభియోగాలు చేయడానికి బ్యాంకు ఉన్నతాధికారులు, మేనేజ్‌మెంట్ కమిటీకి మాత్రమే అర్హత ఉంటుందని, ఫోరం ప్రతినిధులకు ఎలాంటి అధికారం లేదని పేర్కొన్నారు. దమ్ముంటే తనపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఫోరం ప్రతినిధుల అభియోగాల గురించి ప్రస్తావిస్తూ తాను తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

లక్ష్మీకాంత్ రాథోడ్ నియామకంపై హర్షం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకు చెందిన ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌గా నియామకంపై జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సురేశ్‌చందర్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో లక్ష్మీకాంత్‌రాథోడ్ పాలమూరు యూనివర్సిటీ వీసీగా పనిచేసిన సమయంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్, షటిల్ బ్యాడ్మింటన్, ఇండోర్ స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

బైక్, లారీఢీ: యువకుడికి గాయాలు

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ వద్ద మంగళవారం జాతీయ రహదారిపై బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు గాయాలపాలవగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మండలంలోని చిన్న ఆదిరాలకు చెందిన ఒబేదుల్లా తన తల్లి, సోదరిని బైక్‌పై ఎక్కించుకుని జడ్చర్లకు వస్తుండగా.. ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లారీ డ్రైవర్లపై దాడి

జడ్చర్ల: స్థానిక లారీ అసోసియేషన్ వద్ద మంగళవారం లోడింగ్ నిమిత్తం ఎదురు చూస్తుండగా అమీర్, షాహీద్, అస్లామ్ తమపై అకారణంగా దాడులు చేసి గాయపరిచారని బాధితులు ఎండీ అజహర్, ఎండీ ముజాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, లారీ అసోసియేషన్‌లో విభేదాలు ముదిరి దాడులకు కారణమవుతున్నాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లారీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు.

వెలుగొమ్ములలో వైద్య శిబిరం

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో తదతర పరీక్షలు నిర్వహించి ఆవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ శశాంక్, అయుబ్‌ఖాన్, దేవయ్య, రాజేశ్వరి, అంజలమ్మ పాల్గొన్నారు.

వేములలో కంటి వైద్య శిబిరం

అడ్డాకుల: మూసాపేట మండలం వేములలోని రైతువేదికలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా కందూర్ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కంటి వైద్యనిపుణులు జ్యోతి, రాజేశ్వరి, జరీనా, రామస్వామి శిబిరానికి వచ్చిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు టీకే నర్సింహ, చంద్రశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీన్, విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

యూరియా టోకెన్లకు క్యూలైన్లు


నవాబుపేటలో యూరియా కోసం బారులుదీరిన రైతులు


మహమ్మదాబాద్‌లో ఏజెన్సీ ఎదుట బారులుదీరిన రైతులు

- టోకెన్లు అందినా యూరియా రాక నిరాశే..
- రోజంతా పడిగాపులు.. ఇంటిబాట పట్టిన రైతులు

నవాబుపేట: మండల కేంద్రంలోని సహకారం సంఘంలో యూరియా వస్తుందన్న సమాచారంతో అన్నదాతలు క్యూ కట్టారు. తీరా రోజంతా ఇబ్బందులు పడి టోకెన్లు సంపాదించినా చివరికి యూరియా రాలేదని తెలిసి నిరాశతో వెనుదిరిగారు. మంగళవారం మండల కేంద్రంలో రైతువేదిక వద్ద యూరియా కోసం అన్నదాతలు బారులు దీరారు. తీరా టోకెన్లు అందుతాయో లేదోనంటూ ఇబ్బందులు పడి టోకెన్లు సాధించగా.. తీరా యూరియా రాలేదు. రోజు మొత్తం ఎదురుచూసిన అదిగో ఇదిగో అంటూ ఎదురు చూసి చివరికి సాయంత్రం 6 గటంలకు అధికారులు యూరియా రాదంటూ చేతులెత్తేశారు. దీంతో రోజంతా ఇబ్బందులు పడి టోకెన్లు తీసుకున్న అన్నదాతలు యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. కాగా యూరియా రవాణాలో ఇబ్బంది ఏర్పడిందని బుధవారం యూరియాను అందుబాటులో ఉంచుతామని మండల అధికారులు వివరించారు.

ఎట్టకేలకు లోడు యూరియా పంపిణీ

మహమ్మదాబాద్: యూరియా కొరతతో రైతులు నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నారు. మంగళవారం ఉదయం నుంచి మహిళా రైతులు గంటల తరబడి పడిగాపులుగాస్తూ అవస్థలు పడ్డారు. మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా నంచర్లగేట్‌లో రెండు దుకాణాల్లో యూరియా అమ్మగా మండల కేంద్రంలోని నాలుగు దుకాణాల్లో యూరియా తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం లోడు యూరియాను పంపిణీ చేశారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ


వీరన్నపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జడ్చర్ల మున్సిపాలిటీలోని శ్రీసత్యనారాయణ కాలనీలో బతుకమ్మలతో మహిళలు

జడ్చర్ల టౌన్: ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్కజాము ఆయే చందమామ అంటూ మూడోరోజు మంగళవారం రాత్రి మహిళలు ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. వాసవీ, సకలదేవతలు, బంగారుమైసమ్మ ఆలయాలు, సర స్వతీ నగర్, వెంకటేశ్వరనగర్, హౌజింగ్‌బోర్డు కా లనీ, శ్రీనివాసనగర్, శ్రీసత్యనారాయణ కాలనీల్లో మహిళలు పెద్ద ఎత్తు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

■ వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహిళా విభాగం ఆధ్వర్యంలో వీరన్నపేటలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఉత్సవాల్లో మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జనానికి నల్లకుంట పరిశీలన


నల్లకుంటను పరిశీలిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల ముగింపు కోసం నల్లకుంట మినీ ట్యాంక్‌బండ్‌ను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. నిమజ్జనం సాఫీగా జరిగేందుకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక బతుకమ్మ నిర్వహించి అక్కడి నుంచి నిమజ్జనం చేసేందుకు తగిన ఏర్పాట్ల గూర్చి వారు సమీక్షించారు.

గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం


పలు అంశాలపై చర్చిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయం సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.కోటి ఖర్చు నిమిత్తం ప్రతిపాదించారు. ఇందులో అడ్డాకుల గ్రంథాలయ శాఖ నూతన భవన నిర్మాణానికి ఈడబ్ల్యూఐడీసీ నుంచి ప్రతిపాదనలు తీసుకుని, రాష్ట్ర గ్రంథాలయ శాఖ అనుమతుల అనంతరం నిర్మించాల్సి ఉంది. ఇక ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలుకు రూ.3.60 లక్షలు, వివిధ గ్రంథాలయాలకు ఫర్నీచర్ సరఫరాకు రూ.3లక్షలు, పారుపతన మందిరాల ఏర్పాటుకు రూ.10లక్షలు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, ఏఎంఓ శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడీసీ అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 19మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంగళవారం చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశం, మాలిక్‌షాకీర్, మినాజ్, వెంకటయ్య, నిత్యానందం, అశోక్‌యాదవ్, నర్సింహాయాదవ్, ఆనంద్, కౌన్సిలర్ రమేశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై కళాజాత

మిడ్జిల్: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని కంచన్‌పల్లిలో సురక్ష కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రఫిక్, నర్సింహ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉధృతంగా ఊకచెట్టు వాగు

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టు వాగు రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తుంది. సోమవారం కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ ఆరు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. దీంతో నీరు ఊకచెట్టువాగులోకి చేరింది. వాగు సోమ, మంగళవారాలు వాగునిండుగా ప్రవహించింది. దీంతో వాగు పరిసరాల్లోని అప్పంపల్లి, తిర్మలాపురం, అల్లీపురం తదితర గ్రామాల రైతుల మోటర్లు, స్టాటర్లు, పైపులు నీటిలో కొట్టుపోయాయి. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ ఆరుగేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలితే అధికారులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. మోటర్లు, స్టార్టర్లు నీటిలో కొట్టుకుపోయి ఇబ్బందులు కల్గించాయని ఆయా గ్రామాల రైతులు ఆరోపించారు.


చిన్నచింతకుంట వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఊకచెట్టు వాగు

పాతకక్షలతో అన్నపై తమ్ముడి దాడి

నవాబుపేట: పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని తనపై తన తమ్ముడు దాడిచేసి హత్యాయత్నం చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ జనార్దన్ తెలిపాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కూచూర్‌కు చెందిన గడ్డం మల్లయ్య కుమారులు ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా గొడవలుయి. ఈనెల 21న ఆర్మీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది పోలీసు ఉద్యోగం చేస్తున్న గడ్డం రాంచంద్రయ్య తన ఇంటిముందు ఉండగా.. అతని తమ్ముడు గడ్డం వెంకటయ్య, భార్య చిన్నమ్మ, కుమారుడు గడ్డం అజయ్‌కుమార్ గొడ్డలి, రాళ్లతో దాడి చేశారు. దీంతో రాంచంద్రయ్యకు రక్తగాయాలయ్యాయి. ఘటనలో వారించేందుకు మధ్యలో వెళ్లిన బాధితుడి మామకు కూడా రక్తగాయాలయ్యాయి. ఈ సందర్భంగా దాడి చేసిన వారు బాధితుడి కారును సైతం ధ్వంసం చేశారని, గ్రామస్తులు కలుగచేసుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడు మంగళవారం హైదరాబాద్ నుంచి తనపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దాడికి కారణమైన వారిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

పాలమూరు: తెలంగాణ ప్రభుత్వ ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి, 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని కిసాన్‌నగర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సురేశ్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఆదిశేషయ్య, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫహీం కలిసి దాదాపు 80మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందించారు. కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణుడు చతుర్వేది, ఫార్మాసిస్ట్ పట్టాభి, చంద్రయ్య, యోగా శిక్షకుడు అన్వర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రాజాపూర్: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాల రోగాలు నయమవుతాయని పీహెచ్‌సీ వైద్యురాలు సుశ్మిత పేర్కొన్నారు. మంగళవారం ధన్వంతరి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్లు హరికుమార్, సాధన, ఫార్మసిస్టు ఉత్తరయ్య, ఏఎన్ఎం సుజాత, పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం' అమలు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికలకు ముందు మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. అంబేడ్కర్ కళా భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ఉపాధికి ప్రకటించిన అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేసి ప్రతి నిరుద్యోగికి రూ.12లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, పూలే, అంబేడ్కర్ జాతర కార్యనిర్వాహణ కమిటీ అధ్యక్షుడు సామేల్, నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారులు కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలి

మహమ్మదాబాద్: బ్యాంకు ఖాతాదారులంతా కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలని నంచర్లశాఖ ఎస్‌బీఐ మేనేజరు మాణికేశ్వరి తెలిపారు. మంగళవారం నంచర్ల ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకులో ఖాతాలు కలిగిన ప్రతిఒక్కరూ తమ ఖాతాను క్రియాశీలంగా ఉంచుకునేందుకు కేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఖాతాలు లేనివారు జీరో బ్యాలెన్స్ ఖాతాలు కూడా తెరుచుకోవాలని సూచించారు. ఎలాంటి బీమాలేని వారు తక్కువ ప్రీమియంతో జీవిత బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎం చంద్రశేఖర్, ఎఫ్ఐ మేనేజరు శ్రీరామ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కులాల మార్పిడిని ప్రోత్సహించొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

మహమమదాబాద్: కులాల మార్పిడిని అధికారులు, ఇతర కులాలు ప్రోత్సహించరాదని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు వెంకటేశ్ మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార జాతులైన మాదరి కురువలను బీసీలుగా సృష్టించి వారికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వరాదని పేర్కొన్నారు. బీసీ జాబితాలో లేని కురువ కులాన్ని కురుబగా కులమార్పిడి చేసి బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మరో వైపు వారికి ఎస్సీ జాబితా 30నంబరులో ఉండగా కులమార్పిడి చేస్తూ బీసీల్లో కలుపుతున్నారని తెలిపారు. దీంతో నిజమైన బీసీ విద్యార్థులకు ఉద్యోగ రంగాల్లో నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీనివాస్, కిష్టయ్య, దస్తయ్య, వేణుగౌడ్, యాదగిరి, గోపాల్, సత్యం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ రూరల్: నగరంలోని ఏనుగొండ రెవెన్యూ వార్డు దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2, 3 వార్డుల్లో వీధిలైట్లు, ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు వేయించి, అయ్యప్ప కొండపైన ఉన్న వైకుంఠధామంలో బోరు, గార్డెన్ కటింగ్, పిచ్చిమొక్కలను తొలగింపజేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ మ్యాతర్ల కమిటీ సభ్యులు యాదయ్య, కృష్ణ, చెన్నయ్య, శివరాములు, బాలవెంకటయ్య, బచ్చన్న, నర్సింహులు, రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలి

గండేడ్: బహుజన బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈనెల 30న వెన్నాచేడ్‌లో బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీలకతీతంగా బహుజన బతుకమ్మ పోస్టర్‌ను విడుదల చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొని మాట్లాడారు. సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను బహుజనులందరూ కలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ బాలస్వామి, ఉమ్మడి మండలాల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో బాదేపల్లి పేరు నిలపాలి


క్రీడాకారులతో బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవ కమిటీ

జడ్చర్ల టౌన్: రాష్ట్రస్థాయిలో జరిగే ఫుట్‌బాల్ అండర్–19, సీనియర్ విభాగాల్లో రాణించి బాదేపల్లి హైస్కూల్ పేరు నిలపాలని శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ పిలుపునిచ్చారు. ఎస్‌జీఎఫ్ అండర్–19, సీనియర్స్ విభాగాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జట్టులోకి బాదేపల్లి పూర్వ విద్యార్థులు ఆసీఫ్, హర్ష, రిషి, మంజునాథ్, వంశి, చరణ్, నరేశ్, ప్రకాశ్, కల్యాణ్, జహంగీర్, శామ్యూల్, రామ్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఆవరణలో మంగళవారం వారిని శాలువాతో సన్మానించి టీ షర్టులు బహూకరించారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: పట్టణంలోని ఎంబ్రాయిడరీ టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్న సూర్య చామంతి అదృశ్యం కాగా కేసునమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మూసాపేట మండలం జానంపేటకు సూర్యశివశంకర్‌గౌడ్‌కు 15ఏళ్ల కిందట జడ్చర్లకు చెందిన సూర్యచామంతితో వివాహమైంది. ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. 21న ఉదయం 8 గంటల ప్రాంతంలో చామంతి భూత్పూర్‌లోని ఎంబ్రాయిడరీ దుకాణానికి వచ్చింది. రాత్రి 8గంటల వరకు ఇంటికి రాకపోగా.. భర్త ఫోన్‌చేస్తే కలవలేదు. గ్రామం, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. శివశంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవాబుపేట, హన్వాడ మండలాల్లో యువకులు


ప్రవీణ్(ఫైల్)

నవాబుపేట: మండలంలోని లోకిరేవుకు చెందిన యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన సత్యయ్య కుమారుడు కావలి ప్రవీణ్(23) సోమవారం ఇంట్లో నుంచి ఇప్పుడే వస్తానంటూ చెప్పి వెళ్లిపోయాడు. కాగా రాత్రి వరకు రాలేదు. తీరా మంగళవారం బంధువులు, స్నేహితుల చెంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం రాత్రి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ జానర్దన్ తెలిపారు.


రాజునాయక్(ఫైల్)

హన్వాడ: మండలంలోని పిల్లిగుండుతండాకు చెందిన సభావత్ రాజునాయక్ ఈనెల14న ఇంట్లోంచి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని తల్లి శివభాయి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ పేర్కొన్నారు. తల్లి శివభాయి, తండ్రి శంకర్‌నాయక్ బంధువులు, సంబంధీకులను వాకబు చేసినా.. ఎక్కడా ఆచూకీ లభించలేదని, ఈనెల 14న ఉదయం పనినిమిత్తం బయటకు వెళ్లి వస్తానన్న యువకుడు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.